కర్నూలుకు నిమ్మల.. నంద్యాలకు పయ్యావుల

- జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రుల నియామకం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌ఛార్జీ మంత్రులను నియమించింది. మంత్రివర్గంలోని మంత్రులందరికీ కొత్త జిల్లాల వారీగా ఇన్‌ఛార్జీలుగా బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును, నంద్యాల జిల్లాకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రులుగా నియమించారు. జిల్లా నుంచి మంత్రులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డిని అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రిగా, మైనార్టీ సంక్షేమం, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎమ్‌డి.ఫరూక్‌ను నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రిగా, పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్‌ను అనంతపురం జిల్లాకు ఇన్‌ఛార్జీ మంత్రిగా నియమించారు.

ఇక ప్రయివేట్ కిక్కు..!

- **నేటి నుంచి నూతన మద్యం పాలసీ**
- **పూర్తిగా దుకాణాలు తెరచుకోవడం అనుమానమే**
- **నూతన పాలసీపై మహిళా సంఘాల మండిపాటు**

మందుబాబులకు ఇకపై కొత్త కిక్కు ఎక్కనుంది. బుధవారం నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుంది. ప్రయివేట్ మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తి కావడంతో దుకాణాలను దక్కించుకున్న వారు దుకాణాలను ఏర్పాటు చేసుకునే పనిలో పడ్డారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేల అనుమతి లేకుండా దుకాణాలు నిర్వహించుకునేందుకు వీలు లేకపోవడంతో ఎమ్మెల్యే అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. కేటాయించిన షాపులన్నీ తెరచుకోవడం అనుమానంగానే కనిపిస్తోంది. నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రయివేట్ మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. కర్నూలు జిల్లాలోని 99 దుకాణాలకు, నంద్యాల జిల్లాలోని 105 దుకాణాలకు మొత్తంగా 204 ప్రయివేట్ మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయింపులు చేశారు. కర్నూలు జిల్లాలోని 7 అబ్కారీ పోలీసు స్టేషన్ల పరిధిలో 99 ప్రయివేట్ మద్యం దుకాణాలకు టెండర్లు పిలవగా మొత్తం 3,013 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.60.26 కోట్ల ఆదాయం లభించింది. నంద్యాల జిల్లాలోని 105 ప్రయివేట్ మద్యం దుకాణాలకు 2,155 దరఖాస్తులు వచ్చాయి. రూ.43.10 కోట్ల ఆదాయం సమకూరింది. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 31, కోడుమూరు పరిధిలోని 14, ఎమ్మిగనూరు పరిధిలోని 15, ఆదోని పరిధిలోని 12, కోసిగి పరిధిలోని 04, ఆలూరు పరిధిలోని 09, పత్తికొండ పరిధిలోని 14 మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించారు. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ ఎక్సైజ్ స్టేషన్ 19 పరిధిలో దుకాణాలు, ఆత్మకూర్ పరిధిలో 13 దుకాణాలు, బనగానపల్లె పరిధిలో 12 దుకాణాలు, డోన్ పరిధిలో 16 దుకాణాలు, కోవెలకుంట్ల పరిధిలో 11 దుకాణాలు, నందికొట్కూరు పరిధిలో 10 దుకాణాలు, నంద్యాల పరిధిలో 24 దుకాణాలు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీని బుధవారం నుంచి అమల్లోకి తీసుకురానున్నారు. దుకాణాలను దక్కించుకున్న వారు దుకాణాలను ఏర్పాటు చేసుకునే పనిలో పడ్డారు. అయితే పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేల అనుమతి లేకుండా దుకాణాలు నిర్వహించుకునేందుకు వీలు లేకపోవడంతో ఎమ్మెల్యే అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. 30 శాతం కమీషన్ అయినా ఇవ్వాలని లేకుండా ఎంతో కొంత గుడ్‌విల్ తీసుకుని షాపును వదిలేయాలని పలువురు ప్రజాప్రతినిధులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో కేటాయించిన షాపులన్నీ తెరచుకోవడం అనుమానంగానే కనిపిస్తోంది. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ పనిచేస్తుండగా నూతన మద్యం పాలసీ ప్రకారం ప్రయివేటు మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ పని చేయనున్నాయి. గతంతో పోలిస్తే రెండు గంటలు ఎక్కువ సమయం పని చేయనున్నాయి. ప్రయివేటు మద్యం దుకాణాల్లో ఆన్‌లైన్ పేమెంట్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. రూ.99కే మద్యం ఇస్తామని ప్రభుత్వం చెబుతుండటంతో మద్యం ఏరులై పారనుంది. మరోవైపు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

మద్యాన్ని నియంత్రించాలి

మద్యం ధరలు తగ్గించడం కాదు..మద్యం షాపులను నియంత్రించాలి. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మద్యం షాపులను నియంత్రిస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ధరలు తగ్గించి తాగండి ఊగండి, చావండి అనే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. తక్కువ ధరలకు మద్యం తాగి విచక్షణ కోల్పోయి మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. భార్య భర్తలు కష్టపడి సంపాదిస్తే కుటుంబాలు గడవడం కష్టంగా ఉన్న ఈ తరుణంలో మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో నీరు సక్రమంగా అందకపోయినా మద్యం మాత్రం నిత్యము ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దీంతో మద్యం తాగి చనిపోయిన వారి కుటుంబాలు అనాధలై వీధిన పడుతున్నాయి. బెల్ట్ షాపులు పూర్తిగా ఎత్తివేయాలి. మద్యం అంచలంచలుగా ఎత్తివేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

- ఎన్.అలివేలు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు కావాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

పదవ తరగతి లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి, విద్యార్థులతో సంభాషించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై బోధన, పిల్లల సామర్థ్యం, ఉత్తీర్ణత తదితర అంశాల గురించి కలెక్టర్ చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలు బోధించేందుకు వర్చువల్ పద్ధతిలో ఏర్పాట్లు చేయాలని డిఇఒను ఆదేశించారు. వర్చువల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటు, బాగా బోధించే ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిఇఒ శామ్యూల్, కర్నూల్ అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ముందస్తు చర్యతో సిద్ధంగా ఉండాలి

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్ని విధాలా ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. నగరంలోని జొహరాపురం బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న హంద్రీ నదిని, అనంతరం పాతబస్తీలోని రాఘవేంద్ర స్వామి మఠం వెనుక ఉన్న తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాలో అల్పపీడనం ప్రభావం అంతగా లేదని, అయినప్పటికీ అధికారులు అప్రమత్తంగా ఉండి, పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్, కర్నూలు ఆర్‌డిఒలను ఆదేశించారు. హంద్రీనదీ చుట్టూ ఉన్నజంగిల్ క్లియరెన్స్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ అంశంపై చర్చించేందుకు ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్, కర్నూలు ఆర్‌డిఒలను సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాతబస్తీలోని రాఘవేంద్ర స్వామి మఠం వెనుక ఉన్న తుంగభద్రనదీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి

-టిడిపి జిల్లా అధ్యక్షులు పి. తిక్కారెడ్డి పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వాల్మీకి మహర్షి జయంతిని జయప్రదం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి కోరారు. మంగళవారం టిడిపి కర్నూలు జిల్లా కార్యాలయంలో రాష్ట్ర టిడిపి ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బిసి.సెల్ పార్లమెంట్ అధ్యక్షులు సత్రం రామక్రిష్ణుడుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లా కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని ఈనెల 17న అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జయంతి వేడుకలకు జిల్లా మంత్రి టిజి.భరత్, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, ఎంపీలు ముఖ్యనేతలు హాజరు కానున్నారని తెలిపారు. శ్రీరాముని గురించి ఈ రోజు ప్రజలు తెలుసుకో గలుగుతున్నారంటే వాల్మీకి మహర్షి కారణమన్నారు. ఆయన రామాయణాన్ని రచించి దేశానికి ఒక ఆదర్శమూర్తి చరిత్రను తెలుసుకునే అవకాశాన్ని కలుగజేసిన మహానీయులు మహర్షి వాల్మీకి అని అన్నారు. అలాంటి మహానీయుని జన్మదిన వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం తరుపున నిర్వహించేందుకు నిర్ణయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ రోజు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకోవడానికి ఎంతగానో కషిచేసిన నారా లోకేష్ అభినందనీయులని పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో వాల్మీకులకు ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వ పరంగా ఒక పండుగలా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్వరాజ్యాన్ని కాపాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వసతుల కల్పనకు రూ. 4500 కోట్లు కేటాయించిందన్నారు. దీని ద్వారా సిసి రోడ్లు, గోకులాలు, డ్రైనేజీ, వీధిదీపాలు వంటి వసతులను కల్పించేందుకు మార్గం సుగమమైందన్నారు. ఈ వారం రోజులలో చేపట్టిన పనులను సంక్రాంతిలోగా పూర్తిచేసి ప్రారంభిస్తామని తెలిపారు. నాయకులు రామాంజనేయులు, ఎస్.షేక్షావలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిక్కారెడ్డి

నేర నియంత్రణకు చర్యలు

- ఎస్పీ బిందు మాధవ్ - పెద్దతుంబళం పోలీసు స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. మంగళవారం ఆదోని మండలం పెద్దతుంబళం పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో కొబ్బరి మొక్కను నాటారు. పోలీసు స్టేషన్‌లో పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, వాటి పురోగతిపై పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్, ఎక్సైజ్ కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. బాధితులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆదోని డీఎస్పీ సోమన్న, సిఐలు ప్రసాద్, గుణశేఖర్ బాబు, నల్లప్ప, పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్, స్పెషల్ బ్రాంచి ఎస్ఐ వేణుగోపాల రాజు ఉన్నారు.

'కల్లుకుంట'ను సందర్శించిన ఎస్పీ

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట గ్రామాన్ని ఎస్పీ జి.బిందు మాధవ్ సందర్శించారు. గ్రామంలో అమానవీయ ఘటనలో దాడికి గురైన దళిత మహిళ గోవిందమ్మను పరామర్శించారు. బాధిత మహిళ ఇంటిని, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత మహిళ, కుటుంబసభ్యులతో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని, మహిళా కుటుంబానికి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు, కోసిగి సిఐ మంజునాథ, పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

గోవిందమ్మను పరామర్శిస్తున్న ఎస్పీ

కటిక మహమ్మద్ బాషకు డాక్టరేట్

ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్ డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం లక్ష్మీనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డాక్టర్ కటిక మహమ్మద్ బాషకు అరుదైన గౌరవం దక్కింది. అయన సేవలు గుర్తించిన ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తూనే కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 4500 మందికి కటిక మహమ్మద్ బాష ఉచిత వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలను ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్ గుర్తించిన సందర్భంగా అయన సేవలను గౌరవిస్తూ ఈ నెల 15న డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ కటిక మహమ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు సేవలు అందించడంలో తనకు ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు భవిష్యత్తులో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు చేస్తానని ఆయన తెలిపారు.

మోడల్ స్కూల్ మైదానం స్థలం అక్రమణపై తనిఖీ

ప్రజాశక్తి-సి బెళగల్

మోడల్‌స్కూల్ వద్ద ప్రభుత్వ మైదానం స్థలం అక్రమణపై తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. సుమారు మూడు ఎకరాలు సి బెళగల్ మీదుగా ఎమ్మిగనూరు – కర్నూలు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భూమి రూ.కోట్లు విలువ చేస్తుందని అన్నారు. కొందరు ఆక్రమించే యత్నాలు మానుకోవాలని, ప్రధానంగా అక్కడి మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆట స్థలం కోసం వదులుకున్నారని అక్కడే ఒక బాలికల హాస్టల్ కూడా ఉందని, ఆక్రమణలు తగదని హెచ్చరించారు. మోడల్ స్కూల్‌కు కొంత దూరంలో ప్రభుత్వ భూమి ఆక్రమించి సాగులు చేస్తున్నారని తగదన్నారు. సర్వేయర్ నాగభూషణం, తిరుమల నాయుడు, విఆర్ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పల్లె పండుగలో అభివృద్ధి పనులను గుర్తించాలి

ప్రజాశక్తి-సి బెళగల్

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను గుర్తించాలని ఎంపిడిఒ రాణెమ్మ పేర్కొన్నారు. మంగళవారం కంభదహాల్, పలుకుదొడ్డి, చింతమానుపల్లి గ్రామాలలో, కార్యదర్శి కృష్ణ ప్రసాద్, జెఇ.రంగస్వామి అధ్యక్షతన పల్లె పండుగ చేపట్టి సిసి రోడ్లకు, గోకులం షెడ్లకు పూజలు చేశారు. అనంతరం ప్రతి రైతు పొలంలో ఇంకుడు గుంతల ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

ఘనంగా ఎపిజె అబ్దుల్ కలాం జయంతి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

జిల్లా గ్రంధాలయ సంస్థ, కర్నూలు కేంద్ర గ్రంధాలయంలో భారత దేశానికి 11వ రాష్ట్రపతిగా భారత రత్నగా అవార్డు పొందిన, మిస్సేల్ మ్యాన్ ఆప్ ఇండియాగా పేరెన్నిక గొన్న గొప్పశాస్త్రవేత్త కీర్తిశేషులే ఎపిజె .అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సహాయ గ్రంధాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి అబ్దుల్ కలామ్ చిత్రపటంనకు పూలమాల వేశారు. గ్రంధాలయాధికారి కలాం గురించి మాట్లాడుతూ తమిళనాడులోని పుణ్యక్షేత్రమైన రామేశ్వరంలో 1931 అక్టోబర్ 15లో జన్మించారని, మద్రాస్‌రెషిడెన్సీలో ఉన్నత చదువు చదివి ప్రముఖ శాస్త్రవేత్తగా, యువతకు కీర్తి ప్రదాతగా పేరు ఎన్నికగన్నారన్నారు. భారత ప్రభుత్వంచే భారతరత్న అవార్డు పొందారని, వారిసేవలు దేశానికి మంచి పేరు ప్రాముఖ్యతను తెచ్చాయన్నారు. ఆయన మన దేశానికి 11వ రాష్ట్రపతిగా ఎన్నికయి దేశం గర్వించేలా, అభివృద్ధి చెందేలా కృషిచేసారన్నారు. టెక్నికల్ లైబ్రేరియన్ ఎస్.బాష, రికార్డు అసిస్టెంట్ ఈశ్వరమ్మ, అటెండర్ నాగభాస్కర్, ఉమ, కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ మగ్బుల్‌బాష ,సువర్ణమ్మ , అర్జున్, కుమార్, జనార్ధన్, దేవేంద్ర, దాక్షాయని, అనిత, భారతి ,లావణ్య ,బాష, నీలకంఠ గౌడు, నజీర్, సుదాకర్ విద్యార్థులు, ,బాలనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ అధికారులు, పాఠకులు

ఆర్‌టిసి స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కరోనా కాలంలో తొలగించిన 11 మంది ఆర్‌టిసి స్వీపర్స్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ఉన్న కరోనాకాలంలో తొలగించిన ఆర్‌టిసి స్వీపర్లను 11 మందిని కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని సిపిఎం నాయకులు ఎండి.అంజిబాబు కోరారు. మంగళవారం ఆర్‌టిసి స్వీపర్స్ కార్మికుల సమావేశం పి.దేవరాజు అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, నగర నాయకులు సిహెచ్.సాయిబాబా మాట్లాడుతూ ఎపిఎస్ఆర్‌టిసిలో పనిచేసే కాంటాక్ట్ స్వీపర్స్ 26 మంది కార్మికులను కరోనా కాలంలో పనిలేదని తొలగించిందని తెలిపారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి 15 మందిని విధుల్లోకి తీసుకోవాలని, ఇంకా 11 మందిని ఇంతవరకు తీసుకోలేదని తెలిపారు. వెంటనే 11 మంది కార్మికులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పని పెరిగిన కాంట్రాక్టర్ అదనపు పనులు చేస్తున్నారు తప్ప తీసేసిన వారిని పనిలోకి తీసుకోవడం లేదని తెలిపారు. కొంతమంది కార్మికులకు ఇఎస్ఐ కార్డులు కూడా ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను పనిలోకి తీసుకోకపోతే రాబోయే కాలంలో ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు ఎస్ఎండి.రఫీ, కార్మికులు నరసింహులు, రామాంజనేయులు, రంజిత్ కుమార్ ,మద్దిలేటి, సరోజమ్మ , షేకూన్‌బి హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ సాయిబాబా, వేదికపై అంజిబాబు, తదితరులు

ఆటోటాప్ నంబర్లకు ఈ నెలాఖరుకు గడువు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో ప్రయాణికుల సౌలభ్యం కోసం ఆటో డిజిటల్ టాప్ నంబర్లను ఆటోలకు ఇచ్చే కార్యక్రమాన్ని ఈ నెల ఆఖరు వరకు గడువు ఇస్తున్నట్లు కర్నూలు ట్రాఫిక్ సిఐ ఎస్.మన్సూరుద్దీన్ ఆటో యూనియన్ నాయకులకు తెలిపారు. సిఐటియు ఆటో యూనియన్ జిల్లా నాయకులు కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ, పి.మహిమూద్, రవి, హుస్సేన్‌వలీలు మాట్లాడారు. నగరంలో చాలాకాలంగా ఆటోలకు డిజిటల్ నంబర్లు కేటాయించామని, చాలామంది ఆటో డ్రైవర్లు టాప్ నంబర్లు వేసుకున్నారని, ఇంకా అనేక మంది ఆటో డ్రైవర్లు టాప్ నంబర్ల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. అలాంటివారు వెంటనే ట్రాఫిక్ స్టేషన్ , సి క్యాంప్ అవుట్ పోలీస్ స్టేషన్‌లో ఇస్తున్న టాప్ నంబర్లను వెంటనే వేయించుకోవాలని అన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను పాటించి ట్రాఫిక్ అధికారులకు సహకరించాలని ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ బోర్డ్స్, డివైడర్స్ ఏర్పాటు చేసి కొంతవరకు ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ సిఐ తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. అక్కడక్కడ డివైడర్లు ఏర్పాటు చేయడం వల్ల పాత బస్టాండ్ పోయే వాహనాలు ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నేరుగా వెళ తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆటోడ్రైవర్లుగా మనం కూడా నియమ నిబంధనలు పాటించి ఆటోలు నడుపుకోవాలన్నారు. రోడ్ సైడ్‌కు ఆటోలను ఆపుకొని ప్రయాణికుల ను దింపే విధంగా చూసుకోవాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ ఈనెలాఖరుకంతా టాప్ నంబర్లు వేయించుకోవాలని, లేకుంటే ఒకటవ తేదీ నుంచి ట్రాఫిక్ అధికారులు తీసుకునే చర్యలకు గురికావాల్సి వస్తుందని ఆటో డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ ఎఎస్ఐ శివ రాముడు, ట్రాఫిక్ కానిస్టేబుల్ మాసూం వలితో కలిసి టాప్ నంబర్లు తీసుకొని ఆటోలను ఆపి టాప్ నంబర్లు వేయించారు.

సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేసిన డాక్టర్ కెవి సుబ్బారెడ్డికె. పద్మలతారెడ్డి, కె.అశోక్ వర్ధన్ రెడ్డి

వరద బాధితులకు రూ 1 లక్ష విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వరద భాదితుల సహాయార్థం రూ.ఒకలక్ష విరాళంను సీఎం సహాయ నిధికి కార్పొరేటర్ క్రైప పద్మలతా రెడ్డి అందజేశారు. ఇటీవల విజయవాడను ముంచెత్తిన వరదల వల్ల నష్టపోయిన వారిని ఆదుకొనేందుకు తనవంతు సాయంగా కార్పొరేటర్ క్రైపపద్మలతా రెడ్డి, ఆమె తండ్రి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి. సుబ్బారెడ్డ అధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రూ.లక్షరూపాయల చెక్కు ను అందజేసారు. అశోక ఇంజినీరింగ్ కాలేజ్ ఛైర్మెన్ కె అశోక్ వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో శివారు ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. మంగళవారం 19వ వార్డు జోహరపురం బీడీ కార్మికుల కాలనీలో కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించారు. తమ కాలనీలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వర్షాలు కురిస్తే రహదారులు అధ్వానంగా తయారవుతాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ వర్షాలకు అధ్వానమవుతున్న రహదారులపై తక్షణమే తాత్కాలిక నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని, మురుగుకాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇ. శేషసాయి, ఎఇ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పారిశుధ్య తనిఖీదారుడు ఆర్.రాజు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

కాటికాపరుల సమస్య పట్టదా..?

- కెజిబిఎస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాజకీయ పార్టీలకు కాటికాపరుల సమస్య పట్టదా అని కెజిబిఎస్ రాష్ట్ర నాయకులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని శివ సర్కిల్ ఎస్‌బిఐ ఎటిఎంపై ఉన్న కెవిపిఎస్ కార్యాలయంలో శ్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరుల సమస్యలపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా అధ్యక్షులు బేగరి తిక్కప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రంగమ్మ, జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం, ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ మాట్లాడారు. సమాజంలో ఉన్న వృత్తులన్నీ ఒకవైపు అయితే, దళితులు భుజానెత్తుకొని నిర్వహిస్తున్న వృత్తులు సమాజం అంతటికీ ఉపయోగపడేవని తెలిపారు. కరోనా కంటే భయంకరమైన వ్యాధులు ప్రబలే శ్మశానాల్లో వృత్తిని నిర్వహించే కాటికాపరులు నేటికీ కనీసం వృత్తిదారులుగా కూడా గుర్తింపు పొందలేదని తెలిపారు. ఓట్ల కోసం మాత్రమే ముందుకొచ్చే రాజకీయ పార్టీలన్నీ, కాటికాపరులందరినీ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, భృతిని కల్పించాలని కోరారు. లేకపోతే నల్లచొక్కాల సైన్యమై తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఎపిసివిఎస్ జిల్లా కార్యదర్శి సుమాల ఆంథోని, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్న మారయ్య, జిల్లా నాయకులు హనుమంతు, మండల అధ్యక్షులు ఎస్.తిమ్మన్న, సహాయ కార్యదర్శి రాజారమేష్ మాట్లాడారు. కెజిబిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మదన గోపాల్, యువరాజు, వీరేష్, సురేష్, సహాయ కార్యదర్శులు ఈశ్వరయ్య, నాగశేషులు, రంగన్న, ఫిలిప్, మద్దిలేటి, జిల్లా కమిటీ సభ్యులు నాగన్న, నరసింహులు, తొడబలం కేశన్న, ఆంజనేయులు, నరసింహ, దాసు, ప్రకాశం, దావీదు, బసవ, దేవరాజు, జయరాజు, నరసన్న, చార్లెస్ పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులో నివాళులర్పిస్తున్న సిబ్బంది

కౌతాళంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

మండలంలోని తుంబలబీడు ఎంపిపి పాఠశాలలో డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి ఎపిజె.అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ మాట్లాడారు. విద్యార్థి లోకానికి స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాంకు విద్యార్థులంటే ఎంతో ఇష్టమన్నారు. దేశంలోనే అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అలంకరించిన గొప్ప శాస్త్రవేత్త అని తెలిపారు. తుది శ్వాస విడిచే వరకు తనకు ఇష్టమైన అధ్యాపక వృత్తిలో ఉంటూ ఎంతో మందిని మేల్కొలిపి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి కలామని కొనియాడారు. విద్యార్థులు ఆయన మార్గాన్ని ఎంచుకొని అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు రమణారెడ్డి, నాగరాజు, విజయ్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కలాం జయంతి నిర్వహించారు. సెప్టెంబర్‌లో చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శ్రీనివాసులు 10వ తరగతి, శ్రీజ 9వ తరగతి, సాహితీ 8వ తరగతి విద్యార్థులతో అబ్దుల్ కలాం చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుపై గ్రామసభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఖరీఫ్ పంట నమోదుపై మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత మాట్లాడారు. ఖరీఫ్–2024లో పంట నమోదు, ఈకెవైసీ చేయించుకున్న రైతుల తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో లేదా సచివాలయంలో ప్రదర్శిస్తామని తెలిపారు. జాబితాను చూసుకొని పంట, రకం, నీటి పారుదల తదితర వివరాలు సరిచూసుకోవాలని సూచించారు. అనంతరం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా కంది పంటను పరిశీలించారు. మారుకా పురుగు నివారణకు నోవాలురాన్ 1 మిల్లీలీటర్ ఒక లీటర్ నీటికి పిచికారి చేసుకోవాలని తెలిపారు. సర్పంచి రంగారెడ్డి, గ్రామ నాయకులు రంగన్న, రాముడు, వ్యవసాయ సహాయకులు మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో, ఖనిజ సంపదతో

అభివృద్ధికి బాటలు

- మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్, జెసి నవ్య

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామసభలో మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

తుంగభద్ర నదిలో ఉన్న ఖనిజ సంపద ఇసుకతో ప్రజల సహకారంతో సంపదను సృష్టించి అభివృద్ధికి బాటలు వేద్దామని మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్, జెసి డాక్టర్ నవ్య, పొల్యూషన్ కంట్రోల్ డైరెక్టర్ కిషోర్ రెడ్డి, ఇరిగేషన్ ఇఇ శైలేశ్వర రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని గుడికంబాలి, మురళి, నదిచాగి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం తుంగభద్ర నదీతీరంలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయడానికి గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయాలు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. ఈ గ్రామసభల్లో పాల్గొన్న ప్రజలు తమ అభిప్రాయాలు ఈ విధంగా తెలియజేశారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి : శ్రీనివాసులు

గుడికంబాలి గ్రామంలో ఉపాధి పనుల్లేక బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, గుంటూరు తదితర సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రీచ్‌లో పెద్ద పెద్ద యంత్రాలతో కాకుండా లోడింగ్ కోసం గ్రామస్తులకు ఉపాధి పని కల్పించాలని కోరారు. ఇసుక కోసం వచ్చే టిప్పర్లు, ట్రాక్టర్లు ఇష్టానుసారంగా వేగంతో వెళ్తున్నాయన్నారు. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రమాదానికి గురై అంగవైకల్యంతో జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆ వ్యక్తికి ఇంతవరకు ఒక్క పైసా కూడా పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాహనాల ద్వారా జరిగే ప్రమాదాలకు రెవెన్యూ, మైనింగ్ అధికారులే బాధ్యత తీసుకోవాలని కోరారు.

రైతుల పంటలు కాపాడాలి : ఉరుకుందు

ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు తిరగడం వల్ల దుమ్ము, ధూళితో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిని నష్టాల పాలవుతున్నారని ఉరుకుందు తెలిపారు. అప్పుల పాలయిన రైతులు అప్పులు తీర్చడానికి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలకు వాహనాల ద్వారా ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అధికారులే బాధ్యత తీసుకోవాలని కోరారు. లేకపోతే రైతులకు పూర్తిగా పంట నష్టపరిహారం అందేలా బాధ్యత తీసుకోవాలన్నారు.

పాడైపోతున్న రోడ్లను బాగు చేయాలి : రమేష్

ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్, లారీలు అధిక బరువుతో వెళ్లినప్పుడు రోడ్లు పాడైపోతున్నాయని రమేష్ తెలిపారు. గుడికంబాలి నుంచి హాల్వి, కోసిగి, ఉరుకుంద, కౌతాళం రోడ్లు ఇప్పటికే అధ్వానంగా మారాయని చెప్పారు. వాటిని బాగు చేయాలని కోరారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయాలి : ఇసుక రీచ్‌ల నుంచి వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరారు. గ్రామంలో అంగన్వాడీలకు సొంత భవనాలు, మహిళలకు మురుగుదొడ్లు, ప్రజలకు తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, గ్రామానికి బస్సు సౌకర్యం, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. నదిచాగి గ్రామంలో ప్రజలు మాట్లాడుతూ... తుంగభద్ర నది వద్ద ఉన్న ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ఇసుక వాహనాలు గ్రామంలో కాకుండా గ్రామ బయట నుంచి రాకపోకలు కొనసాగించాలని తెలిపారు. ప్రజలు విన్నవించిన సమస్యలు విన్న అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కౌతాళం తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న శ్రీనివాసులు, ఉరుకుందు, రమేష్

ఘనంగా మాబుసుభాని ఉరుసు మహోత్సవం

- దర్గాను దర్శించుకున్న రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని వగరూరు గ్రామంలో మాబుసుభాని ఉరుసు మహోత్సవాన్ని కులమతాలకు అతీతంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా మాబుసుభాని దర్గాను వివిద రకాల విద్యుద్దీపాలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. దర్గా దగ్గర ప్రజలు నైవేద్యాలు సమర్పించారు. మాబుసుభాని దర్గాను టిడిపి నాయకులు, మాధవరం మాజీ సర్పంచి రఘునాథ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు పవన్ కుమార్, వీరారెడ్డి, గోపాల్, లింగప్ప ఉన్నారు.

పూజలు చేస్తున్న మాధవరం మాజీ సర్పంచి రాఘవేంద్రరెడ్డి, టిడిపి నాయకులు

దేవరగట్టులో గురవయ్యల సందడి

- ఆకట్టుకున్న గొలుసు తెంపుట, దేవదాసీల నృత్యాలు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండలం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలిసిన శ్రీమాల మల్లేశ్వరుల బన్ని ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జాతర సందర్భంగా గురవయ్యలు సందడి చేశారు. గురవయ్యలాట, గొలుసు తెంపుట, దేవదాసీల నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాజలింగ అనే గురవయ్య గొలుసులు 51 జటికలకు తెంపారు. గతేడాది మూడు జటికలకే గొలుసు తెగిపోవడంతో అంతా మంచే జరుగుతుందని అనుకున్నారు. ఈ ఏడాది వర్షాలు కూడా సమృద్ధిగా కురిశాయి. జాతర సందర్భంగా భక్తులు వేల సంఖ్యలో తెల్లవారుజామునే కొండకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు కొండ కిక్కిరిసింది. కొంతమంది భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్, హోళగుంద ఎస్ఐ బాల నరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గొలుసు తెంపుతున్న భక్తుడు

నృత్యం చేస్తున్న దేవదాసీలు

నృత్యం చేస్తున్న గొరవయ్యలు

తప్పిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన సిఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తప్పిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యమైనట్లు, తల్లితండ్రులకు అప్పగించినట్లు మంగళవారం సిఐ ఎ.గంగాధర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... గోనెగండ్ల గ్రామంలోని శ్రీరామనగర్ కాలనీకి చెందిన పూజారి పద్మావతి, పూజారి వెంకటేశ్వర్లు కుమారుడు పూజారి అనిల్ కుమార్ ఇంటర్మీడియట్ చదువుతున్నారు. అనిల్ కుమార్ సెప్టెంబర్ 1న మధ్యాహ్నం స్నేహితునికి పుస్తకం ఇచ్చి వస్తానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని తల్లి పద్మావతి గోనెగండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ అతని ఆచూకీ కోసం విచారణ చేపట్టారు. చివరికి విద్యార్థి అనిల్ కుమార్ నందికొట్కూరులోని డైమండ్ బిర్యానీ హోటల్‌లో గత 45 రోజులుగా పని చేస్తున్నాడని తెలుసుకొని మంగళవారం కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నందికొట్కూరుకు వెళ్లి బాలుని తీసుకొచ్చారు. బాలునికి తగిన జాగ్రత్తలు చెప్పి అతని తల్లిదండ్రులకు సిఐ గంగాధర్ అప్పగించారు. విద్యార్థి అనిల్ కుమార్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సిఐకి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కౌన్సిలర్లపై చిన్నచూపు తగదు

- వైసిపి కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వకుండా కౌన్సిలర్లను చిన్న చూపు చూడడం తగదంటూ మున్సిపల్ కమిషనర్ కృష్ణను వైసిపి కౌన్సిలర్లు నిలదీశారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో వైస్ ఛైర్మన్ నరసింహులు ఆధ్వర్యంలో కమిషనర్ కృష్ణతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, ఫయాజ్, బాలాజీ మాట్లాడారు. వైసిపి హయంలోనే టిడ్కో సముదాయంలో అన్ని సౌకర్యాలూ కల్పించామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక గృహాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రస్తుతం కనీసం సమాచారం ఇవ్వకుండానే నేరుగా టిడ్కో గృహాల ప్రవేశానికి లబ్ధిదారులను పురమాయించడం తగదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే అధికార పార్టీ నాయకులతో అధికారులు కుమ్మక్కు కావడం తగదంటూ నిలదీశారు. అక్కడికి వెళ్లి సౌకర్యాలు లేవని లబ్ధిదారులు తమతో వాపోతున్నారని తెలిపారు. వారికేం సమాధానం చెప్పాలని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులవారీగా లబ్ధిదారుల వివరాలను తమకు పంపాలని, వారు ఇళ్లలో చేరే సమయంలో తమ ఆధ్వర్యంలో జరగాలని కౌన్సిలర్లు పట్టుపట్టారు. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. అక్కడ సౌకర్యాలు కల్పించకుండానే చేరాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదని తెలిపారు. పద్ధతి మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, గృహాల్లో చేరేలా లబ్ధిదారులకు నచ్చజెప్పాలని కమిషనర్ కృష్ణ వైసిపి కౌన్సిలర్లకు విజ్ఞప్తి చేశారు. వైసిపి కౌన్సిలర్లు చలపతి, ఇంతియాజ్, ఉస్మాన్, నాయకులు ఆనంద్, రహమాన్, మాధవ రెడ్డి, కిషోర్, మధుబాబు, ఇబ్రహీం, గోవిందు ఉన్నారు.

కమిషనర్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్లు

ప్రకటన
మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. 660/2021 I.A. 95/2019 O.S. 439/2017
Between :
Darivemula Wilson (D1) ..... పిటీషనర్
Vs
Darivemula Babji ..... రెస్పాండెంట్
To,
Darivemula Babji S/o Aseervadam,
R/o D.No. 8/49, Kothapet, Dhone,
Kurnool District.
పై నెంబరు పిటీషన్‌లోని రెస్పాండెంట్‌కి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను గ్రామంలోనే వుండి కూడా తీసుకొనని కారణంగా మీకు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం ది. 28-10-2024వ తేదీన వాయిదా అయివున్నది. ఆ రోజున మీరు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పరోక్షమందు తీర్మానించబడును.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదాతేది : 28-10-2024
ఇట్లు
జి.అలెగ్జాండర్ సుధాకర్,
పిటీషనర్ తరఫు అడ్వకేట్,
నరసరావుపేట.

మహారాజశ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P. 16/2024 in O.S. No. 555/2016
పెద్ద కాశీమ్ బీ ...డిక్రీహోల్డర్
-V/s-
ఎస్.మన్‌సూర్ దేశాయ్ Died rep by his legal heirs
1) యస్. మైమున్నీషా బేగం
D/o. మన్‌సూర్ దేశాయ్ (Late)
2) యస్. ఎవోలియ బేగం
D/o. మన్‌సూర్ దేశాయ్ (Late)
3) ఎస్. అజరత్ దేశాయ్
S/o. మన్‌సూర్ దేశాయ్ (Late)
4) ఎస్. ముదాసర్ దేశాయ్
S/o. మన్‌సూర్ దేశాయ్ (Late)
All R/o. H.No. 4/78, నాగలదిన్నె గ్రామం, నందవరము మండలం, కర్నూలు జిల్లా.
Now R/o. H.No. 87-149, మాధవి నగర్, కల్లూరు గ్రామం & మండలం, కర్నూలు జిల్లా.
... రెస్పాండెంట్స్
ORDER - 5 RULE-20
సదరు నెంబరులోని డిక్రీహోల్డర్ మీ పై అమలు దావాను దాఖలు చేసివున్నారు. ఈ విషయమై మీకు ఆక్షేపణనున్న ఎడల 25-10-2024వ తేదిన వారికి రావల్సిన పైకము కొరకు పై కోర్టులో అమలు చేసియున్నారు. ఉదయం 10-30 గంటలకు ఖుద్దునగానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో మీరు హాజరై పై కోర్టు వారికి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమందు విచారించి తీర్మాణం చేయుదురని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 25-10-2024
కె. నారాయణ
అర్జీదారు పరం అడ్వకేట్,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9441332133

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు కర్నూలు అట్ ఆదోని
A.S.No. 7/2023
Between:
కటికె రుబియా W/o లేట్ కటికె చిన్న బాబు
పెద్దకడబూరు గ్రామం & మండలం, కర్నూలు జిల్లా.
...అప్పిలెంట్
V/s
శ్రీమతి సాలె వగ్గా గౌరమ్మ. ...రెస్పాండెంట్
అప్పీల్ నోటీస్ టు రెస్పాండెంట్
To
శ్రీమతి సాలె వగ్గా గౌరమ్మ
W/o సాలె వగ్గా రామాంజినీయులు
వార్డు నెం.12, ఇంటి నెం.224,
పెద్దకడబూరు గ్రామం & మండలం, కర్నూలు జిల్లా.
పై తెలిపిన అప్పిలెంట్ వారు రెస్పాండెంట్ అయిన మీపైన పై కోర్టులో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఆదోని O.S.No. 263/2014 దావా నందు ఇచ్చిన డిక్రీ జడ్జిమెంట్ తేది: 14-12-2021 కు వ్యతిరేకంగా అప్పీలు దాఖలు వేసియున్నారు. పై కోర్టు నుండి రెస్పాండెంట్ అయిన నీకు చాలా సార్లు అప్పీల్ నోటీసులు పంపిననూ తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై తెలిపిన అప్పిల్ వాయిదా తేది: 23-10-2024 ఉదయం 10.30 గంటలకు రెస్పాండెంట్ అయిన నీవు కోర్టు ముందు హాజరు కావలెనని, నీ తరపున ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల నీవు ఖుద్దుగా గాని, మీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. రెస్పాండెంట్ అయిన నీవు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో అప్పిలెంట్ పరముగా నీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
//కోర్టు వారి ఆర్డరు మేరకు//
వాయిదా తేది : 23-10-2024
శ్రీ బి.సి నరసింహులు,
అప్పిలెంట్ తరఫు వకీలు,
ఆదోని - 518301.
Cell No. 9052960923

హాలిగేరలో ఇద్దరు మృతి

- గుండెపోటుతో వలస కూలీ...

- అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని హాలిగేర గ్రామంలో ఒకేరోజు ఇద్దరు మృతి చెందారు. గుండెపోటుతో వలస కూలీ మృతి చెందగా, అప్పలబాధ తాళలేక మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒకే రోజు ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

హాలిగేర గ్రామానికి చెందిన ముల్లా హస్సేన్ వలీ (43) గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని హాలిగేర గ్రామానికి చెందిన ముల్లా హస్సేన్ వలీ మరో ముగ్గురితో కలిసి తెలంగాణలోని జహీరాబాద్‌లో పత్తి కోతలకు సిద్ధంగా ఉన్న రైతులతో కిలోల ప్రకారం రేటు మాట్లాడడానికి బయల్దేరారు. గోనెగండ్ల సమీపంలోకి వెళ్లే సరికి గుండెనొప్పి రావడంతో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందామని గోనగండ్లలో ఉన్న తన సోదరుని ఇంటికి వెళ్లారు. నొప్పి ఎక్కువ కావడంతో కర్నూలులోని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మృతునికి భార్య నూర్జహాన్, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అప్పల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

అప్పుల బాధ తాళలేక మద్యానికి బానిసై హాలిగేర గ్రామానికి చెందిన బోయ లక్ష్మన్న (39) ఆత్మహత్యకు పాల్పడ్డారు. సిఐ మస్తాన్ వలీ వివరాల మేరకు... మండలంలోని హాలిగేర గ్రామానికి చెందిన బోయ లక్ష్మన్న మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. రోజూ తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడేవారు. సోమవారం కూడా మద్యం సేవించి గుడిసెలో వేసుకున్న చీర ఉయ్యాలలో ఊగుతూ రాత్రి అలానే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. లక్ష్మన్నకు ఒక్క ఎకరా భూమి కూడా లేదని, ప్రతేడాది కుటుంబంతో కలిసి వలస వెళ్లే వారని సిఐ తెలిపారు. మృతునికి భార్య పార్వతి, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గ్రామాలాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే బీవీ

నందవరంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

గ్రామాలాభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం నందవరం మండలం మాచాపురం గ్రామంలో 'పల్లె పండగ' నిర్వహించారు. ఆయనకు మాచాపురం మాజీ సర్పంచి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీంవలీ, పీరా సాహెబ్, వలీ ఘన స్వాగతం పలికారు. రోడ్లు, తాగునీరు, మినీ గోకులం తదితర అభివృద్ధి పనులకు రూ.40 లక్షలతో భూమిపూజ చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేక పోయిందని విమర్శించారు. వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. జల జీవన్ మిషన్ కింద గ్రామంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. ధర్మపురం గోపాల్, బండే గురుస్వామి, చిన్న రాముడు, హాలహర్వి దావీదు, కైరవాడి వీరేష్, నాగేష్, మాబు హుసేని, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఆస్పరి : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, బిజెపి ఇన్‌ఛార్జీ వెంకట రాముడు తెలిపారు. మండలంలోని బిణిగేరి, జొహరాపురం, ఆస్పరి గ్రామాల్లోని సచివాలయాల్లో ఎంపిడిఒ గీతావాణి ఆధ్వర్యంలో 'పల్లె పండగ' నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్ర గౌడ్ మాట్లాడారు. గ్రామాల్లో డ్రెయినేజీ, సిసి రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. బిణిగేరి గ్రామానికి రెండు సిసి రోడ్లకు రూ.10 లక్షలు, గోకులం షెడ్డుకు రూ.2.30 లక్షలు, జొహరాపురం గ్రామానికి మూడు సిసి రోడ్లకు రూ.15 లక్షలు, గోకులం షెడ్డుకు రూ.2.30 లక్షలు, ఆస్పరి గ్రామానికి నాలుగు సిసి రోడ్లకు రూ.20 లక్షలతో పనులు ప్రారంభానికి భూమి పూజ చేశారు. అంతకుముందు వీరభద్ర గౌడ్‌కు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఏపీడీ పద్మావతి, సర్పంచులు మూలింటి రాధమ్మ, నెలురప్ప, ఎపిఒ రామకృష్ణ, ఎపిఎం జనార్దన, పిఆర్ ఎఇ వెంకటేశ్వర్లు, టిడిపి మండల కన్వీనర్ పరమ రెడ్డి, బిజెపి మహిళా నాయకులు కాశమ్మ, టిడిపి నాయకులు ఎస్.తిమ్మన్న, మల్లికార్జున, శ్రీవాస్ గౌడ్, రాజ్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

ఆస్పరిలో భూమి పూజ చేస్తున్న వీరభద్ర గౌడ్

కౌతాళం : కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల రూపురేఖలే మారుతున్నాయని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య తెలిపారు. మండలంలోని ఎరిగేరి, కామవరం, ఉరుకుంద గ్రామాల్లో సిసి రోడ్లకు భూమిపూజ చేశారు. నాయకులు వెంకటపతి రాజు, సురేష్ నాయుడు, అడివప్ప గౌడ్, టిప్పు సుల్తాన్, ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎపిఒ శంకర్, పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసరెడ్డి, నాయకులు రామలింగ, గిడ్డయ్య, బసవరాజు, మహాదేవ, చిరంజీవి, తాయప్ప, రంగస్వామి, తిక్కన్న, నబీ, జాకీర్ పాల్గొన్నారు.

చిప్పగిరి : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమవుతుందని మాజీ జడ్‌పిటిసి ఏరూరు మీనాక్షి నాయుడు తెలిపారు. 'పల్లె పండగ' వారోత్సవాలను ఏరూరు సర్పంచి వెంకటలక్ష్మి, బంటనహాల్ సర్పంచి సుశీలమ్మ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. ఏరూరు గ్రామంలో సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు, బంటనహాల్ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయినట్లు అధికారులు తెలిపారు. మీనాక్షి నాయుడు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఏ విధమైన అభివృద్ధి పనులు చేయలేదని తెలిపారు. తమ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తారన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే ప్రజలు కూడా ఆ ప్రభుత్వాలను అభినందిస్తారని తెలిపారు. మాజీ ఎంపిటిసి నరసింహులు, మాజీ సర్పంచి కోనంకి మహేష్, టిడిపి నాయకులు తిమ్మప్ప, ఎంపిడిఒ అల్లా ప్రకాష్, ఎపిఒ జాబర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, ప్రమీల, విఆర్ఒ సునీత, అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మంత్రాలయం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పల్లెల అభివృద్ధికి కృషి చేస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు, మాధవరం మాజీ సర్పంచి, టిడిపి నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని బూదూరు, తిమ్మాపురం, వగరూరు గ్రామాల్లో సిసి రోడ్లకు భూమిపూజ చేశారు. ఉపాధి హామీ చట్టం కింద బూదూరు గ్రామంలో రూ.5 లక్షలతో, తిమ్మాపురంలో రూ.4 లక్షలతో, వగరూరులో రూ.12 లక్షలతో, రూ.10 లక్షలతో సిసి రోడ్ల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. వగరూరు సర్పంచి లింగారెడ్డి, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, టిడిపి సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, నాయకులు గోపాల్, శివరాముడు, పవన్ కుమార్, లింగప్ప, ఎంపిడిఒ శోభారాణి, ఇఒఆర్‌డి ప్రభావతి, పిఆర్ ఎఇ మల్లయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకట రాముడు, ఎపిఒ తిక్కారెడ్డి, ఇసి సూర్య ప్రకాష్, కార్యదర్శులు వెంకటరత్నం, వీరేష్ పాల్గొన్నారు.

హాలహర్వి : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను గుర్తించాలని ఎంపిడిఒ వరలక్ష్మి పేర్కొన్నారు. హర్దగేరి, మేదేహాల్ గ్రామాల్లో ఇఒఆర్‌డి రామాంజనేయులు అధ్యక్షతన 'పల్లె పండగ' నిర్వహించారు. సిసి రోడ్లకు, గోకులం షెడ్లకు భూమిపూజ చేశారు. ఎంఇఒ–2 శ్రీనివాసరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, సర్పంచి గురుదాస్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు బోగోటి నాగరాజు పాల్గొన్నారు.

గోనెగండ్ల : మండలంలోని పెద్దమర్రివీడు గ్రామంలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు టిడిపి నాయకులు తెలిపారు. సిసి రోడ్డు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే బీవీ ఉపాధి హామీ చట్టం కింద రూ.15 లక్షలు నిధులు మంజూరు చేయించారని చెప్పారు. 'పల్లె పండగ'లో భాగంగా పెద్దమర్రివీడు గ్రామంలో ఎంపిడిఒ మణిమంజరి, పిఆర్ ఎఇ శంకర్‌లు సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. టిడిపి పెద్దమర్రివీడు నాయకులు మాదిగ నాగరాజు, మల్లేష్, చిన్న అబ్దుల్లా, ప్రభుదాసు, రాముడు, హనుమన్న, ఏసోపు, శ్రీరాములు పాల్గొన్నారు.

కౌతాళం మండలంలో...

చిప్పగిరిలో భూమిపూజ చేస్తున్న సర్పంచి వెంకటలక్ష్మి, మీనాక్షి నాయుడు

మంత్రాలయంలో...

హాలహర్విలో....

గోనెగండ్లలో భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆదోని

ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 14 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సిఐ శ్రీరామ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. సిరిగుప్ప చెక్‌పోస్ట్ వద్ద హెడ్ కానిస్టేబుల్ సత్తార్ వలీ, పోలీసు కానిస్టేబుల్ మునిచంద్ర, మల్లయ్య, వీరశేఖర్, లక్ష్మన్, సుధాకర్‌తో కలిసి వాహనాలు తనిఖీ చేశామని తెలిపారు. పట్టణంలోని మరాఠి వాడికి చెందిన బందే అలీ నుంచి 14 అట్టపెట్టెల్లో 1,344 ఒరిజినల్ ఛాయిస్ విస్కీ 90 ఎంఎల్, కర్ణాటక టెట్రా పాకెట్లను ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆటోను సీజ్ చేసినట్లు తెలి పారు. నిందితుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.